# వ్యక్తులు.. మనస్తత్వాలు

ఇంగ్లిష్‌లో మనస్తత్వాన్ని ‘ఆర్చిటైప్’ అనీ అంటారు. మూలమూర్తి అనే అర్థం వచ్చే ఈ పదానికి మూలాలు ప్రాచీన గ్రీకు భాషలో ఉన్నాయి. ప్రసిద్ధ మానసిక శాస్త్రజ్ఞుడు, మానసిక విశ్లేషకుడు కార్ల్ గుస్తావ్ యూంగ్ మానవ మనస్తత్వంలో ఈ ఆర్చిటైప్ అనే భావనకు ప్రాణం పోశాడు. మనుషుల్లో పదిరకాల స్వభావాలు ఉన్నట్టు ఆయన కనుగొన్నాడు. ప్రతి మనిషిలోనూ ఈ స్వభావాల్లో ఏదో ఒకటి బలంగా కనిపిస్తుంది. వారి వ్యక్తిత్వాలనూ అది ప్రభావితం చేస్తుంది.

## 1 అమాయకులు

అందరూ స్వేచ్ఛగా ఉండాలనుకుంటారు. ఇలపై స్వర్గాన్ని సృష్టించాలన్నది ప్రగాఢ వాంఛ. నిలువెత్తు సంతోష స్వరూపులు. ఆశావాదం వీరికి అదనపు బలం.

## 2 అందరివారు

స్త్రీలు, పురుషులు.. అంతా సమానమే అనేది వీరి నమ్మకం. ఇతరులతో కలివిడిగా ఉండాలనుకుంటారు. అందరివారిగా బతకాలనుకుంటారు. సమూహం నుంచి బయటికి వెళ్లాల్సి వస్తుందేమో అని భయపడతారు. బలమైన బంధాలను కలిగి ఉంటారు.

## 3 హీరోలు

మనసుంటే మార్గం ఉంటుందనే మనస్తత్వం. సాహసోపేతమైన చర్యల ద్వారా తమను తాము నిరూపించుకోవాలనేది ఆకాంక్ష. ప్రపంచాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తారు.

## 4 సంరక్షకులు

పొరుగువారిని ప్రేమిస్తారు. ఇతరులకు ఎంత సాయం చేయడానికైనా వెనుకాడరు. సాధువు, పరోపకారి, సంరక్షకుడు, సహాయకుడు, అండగా నిలిచేవాడు.. కేర్‌గివర్ వివిధ రూపాలు.

## 5 అన్వేషకులు

నాకు సంకెళ్లు వద్దు.. అనేది వీరి నినాదం. భ్రమణకాంక్ష ఎక్కువ. కొత్త ప్రదేశాలు చూస్తారు. కొత్త వింతల గురించి తెలుసుకుంటారు. కొన్నిసార్లు తమకంటూ ఓ లక్ష్యం ఉండదు.



## 6 తిరుగుబాటుదారులు

నియమాలు ఉన్నది ఉల్లంఘించడానికే అనుకునే తత్వం. ప్రతీకార కాంక్షతోనో, విప్లవ భావాలతోనో రగిలిపోతుంటారు. నచ్చనిదానికి దూరంగా ఉంటారు. స్వేచ్ఛా ప్రియత్వమే వీరి బలమూ, బలహీనతా.

## 7 ప్రేమికులు

పుట్టిన ప్రాంతంలో, చుట్టూ ఉన్న మనుషులతో, మట్టితో, జంతువులతో, సాహిత్యంతో పీకల్లోతు ప్రేమలో పడతారు. ప్రజలతో, పరిసరాలతో మంచి సంబంధాలు కోరుకుంటారు. కృతజ్ఞత, ప్రశంస వీరి బలాలు.





## 8 సృజనశీలురు

ప్రతి ఊహనూ నిజం చేసుకోవాలని అనుకుంటారు. పక్కా పర్ఫెక్షనిస్టులు. కళాభిరుచిని, నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలని అనుకుంటారు. సృజనాత్మకత, కాల్పనికత వీరి బలాలు.



## 9 రుషులు

సత్యమే మనకు విముక్తిని ప్రసాదిస్తుందని నమ్ముతారు. పరమ సత్యాన్ని కనుగొనడమే లక్ష్యమని చెబుతారు. అజ్ఞానంలో కూరుకుపోతామని భయపడుతూ ఉంటారు. అధ్యయనమే తప్ప, ఆచరణకు దిగకపోవడం వీరి బలహీనత.



## 10 పాలకులు

సుసంపన్నమైన, విజయవంతమైన కుటుంబాన్ని, సమాజాన్ని నిర్మించడం లక్ష్యం. అధికారం కోసం ఉవ్విళ్లూరుతారు. పీఠాన్ని కోల్పోతామని భయపడతారు. ఎవరితోనూ సత్సంబంధాలు లేకపోవడం వీరి బలహీనత.